క్లుప్తంగా

కాళహస్తీశ్వరునికి రాహుకేతు ప్రతిమలు


కేతు ప్రతిమతో శ్రీనివాస్, పార్వతి దంపతులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేటకు చెందిన రామకృష్ణ బ్రాస్ అండ్ సిల్వర్ వర్క్స్ అధినేత, శిల్ప కళాకారుడు వాసా శ్రీనివాస్, లక్ష్మీపార్వతి దంపతులు కాళహస్తీశ్వరస్వామి ఆలయంలో అందజేయడానికి రాహు, కేతువుల ప్రతిమలను తయారు చేయించారు. రూ.1.22 లక్షలను ఖర్చుతో రాగిపై బంగారు తాపడం చేసి వీటిని రూపొందించారు. ఈ నేపథ్యంలో సోమవారం కాళహస్తికి ప్రయాణమయ్యారు. వాటిని ఆ ఆలయంలో మంగళవారం అందజేయనున్నారు.

భవిత కేంద్రానికి రూ.1.50 లక్షల విరాళం


మంత్రి సుభాష్ చేతుల మీదుగా నగదు అందజేస్తున్న సంస్థ జనరల్ మేనేజర్ హరీష్

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండల భవిత కేంద్రానికి కాకినాడకు చెందిన మహతి స్టోరేజ్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సోమవారం రూ.1.50 లక్షలు విరాళంగా అందజేశారు. సంస్థ జనరల్ మేనేజర్ టీవీ హరీష్‌కుమార్ మంత్రి నివాసంలో ఆయన చేతుల మీదుగా అందజేశారు. భవిత కేంద్రం నిర్వాహకులు బాబు, నాగమణి, ఎంఈఓ తాడి వీరరాఘవ రెడ్డి పాల్గొన్నారు.

గణపతికి పూజలు


కె.గంగవరంలో ఏర్పాటు చేసిన 3 అడుగుల మట్టి వినాయక విగ్రహం

కె.గంగవరం: గ్రామంలోని ఓసీ కాలనీలో గణేశ్ మంటపంలోని స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన మూడు అడుగుల మట్టి విగ్రహానికి ప్రతి రోజు పూజలు చేస్తున్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాలనే ఉద్దేశంతో మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. వచ్చే ఏడాది అయినా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే ఏర్పాటు చేస్తే మంచిదన్నారు.

విద్యలో పోటీతత్వం అలవర్చుకోవాలి


విద్యార్థులకు సూచలిస్తున్న పరిశీలిస్తున్న మోనటరింగ్ ఆఫీసర్ రాంబాబు

కె.గంగవరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను నేర్చుకుంటున్న ప్రతి విద్యార్థి ప్రతి పరీక్షలోను మంచి ఫలితాలు సాధించి పోటీ తత్వం అవలర్చుకోవాలని సర్వశిక్షా అభియాన్ మోనటరింగ్ ఆఫీసర్ రాంబాబు సూచించారు. మండల పరిధిలోని గుడిగళ్లబాగ గ్రామంలో ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. తొలుత విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించి విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు చదువులో రాణించడానికి పోటీతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. సులవు పద్ధతిలో విద్యాను నేర్చుకునేందుకు ప్రయత్నించాలని కోరారు.

లడ్డూ ప్రసాదాలకు వేలం


అంగరలో లడ్డూ ప్రసాదాలను స్వీకరిస్తున్న భక్తులు

కపిలేశ్వరపురం: అంగరలోని ఆది గణపతి వినాయక నవరాత్ర శిబిరంలో సోమవారం లడ్డూ వేలం నిర్వహించారు. ఆలయానికి భక్తుడు సమర్పించిన 11 కిలోల లడ్డూను సుంకర నాగు, యర్రా వెంకన్న రూ.3 వేలకు పాడారు. మరో 13 కిలోల మరో లడ్డూ ప్రసాదానికి వేలం నిర్వహించగా బత్తిన శ్రీనివాస్, యర్రా సుబ్బారావు, కొల్లాటి సురేష్ రూ. 3,100కు దక్కించుకున్నారు. వాటిని పాటదారులకు ఉత్సవ నిర్వాహకులు అందజేశారు.

కష్టాల ఖరీఫ్

- ఆదిలోనే అన్నదాతల ఆందోళన
- వరిని ఆశిస్తున్న కాండం తొలుచు పురుగు
- పురుగు మందు పిచికారీలో రైతులు

రాయవరం: వ్యవసాయం చేయడానికి అన్నదాత అష్టకష్టాలు పడుతున్నాడు. సాగు నీటి ఇబ్బందులు, ప్రకృతి కన్నెర్ర, తెగుళ్లు, యూరియా కొరత.. ఇలా అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయి. ప్రస్తుత ఖరీఫ్ ఆరంభంలో ఆశలు రేపినప్పటికీ, వాతావరణ పరిస్థితుల కారణంగా తెగుళ్లు ఆశిస్తున్నాయి. దుబ్బు కట్టి చిరుపొట్ట దశకు చేరుకుంటున్న తరుణంలో ఒక వైపు మూషికాల దాడి, మరో వైపు వాతావరణ మార్పులతో కాండం తొలుచు పురుగు భయపడుతోంది. దీంతో రైతులు కాండం తొలుచు పురుగు నివారణకు పురుగు మందుల పిచికారీలో నిమగ్నమయ్యారు.

వాతావరణ మార్పులు

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం, కాజులూరు మండలాల పరిధిలో సుమారు 1.01 లక్షల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో ఎంటీయూ 7029 (స్వర్ణ) రకాన్ని 60 శాతం, ఎంటీయూ 1318 రకాన్ని 35 శాతం మేర వేశారు. మిగిలిన ఐదు శాతంగా రబీకి విత్తనాలను సిద్ధం చేసుకోవడంలో భాగంగా ఎంటీయూ 3626 (బొండాలు), ఎంటీయూ 1121, 1156 తదితర రకాలను సాగుచేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు ఆశించినంతగా కురవలేదు. ఇదిలా ఉంటే వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు, అధిక ఉష్ణోగ్రతల కారణంగా వరి పంటను కాండం తొలుచు పురుగు ఆశించింది. ఈ తెగులును రైతులు వాడుక భాషలో మొవ్వు పురుగు అని పిలుస్తారు. దీని కారణంగా దుబ్బు మొదల్లో పురుగు ఆశించి దుబ్బు కుళ్లిపోతుంది. దుబ్బులోని పోషక పదార్థాలను లార్వా దశలో ఉన్న పురుగు తినడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

నివారణ ఇలా..

రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే కాండం తొలుచు పురుగు నివారణను నివారించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రొఫినోపాస్ రెండు మిల్లీ మీటర్ల మందును లీటరు నీటిలో కలిపి ఎకరాకు 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలి. కార్టాఫ్ హైడ్రో క్లోరైడ్ 50 ఎస్‌పీ రెండు గ్రాముల మందు ద్రావణాన్ని లీటరు నీటికి కలిపి, ఎకరాకు 200 లీటర్ల మందు ద్రావణాన్ని చల్లాలి. ప్రస్తుతం వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు, గాలివాటం కారణంగానే కాండం తొలుచు పురుగు ఆశిస్తుంది. అలాగే లింగార్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవడం, ఆకుల చివర్లను తుంచడం (లీఫ్ టిప్స్), వేసవిలో లోతు దక్కులు చేసుకోవడం వల్ల పురుగును ప్యూపా దశలోనే నివారించుకునే వీలుంటుంది. ముందుగా ఊడ్చిన పొలాలను కాండం తొలుచు పురుగు అధికంగా ఆశిస్తోంది.

ఖరీఫ్ సాగు వివరాలు

మండలం	గ్రామాలు	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	రైతులు
రామచంద్రపురం	25	18,806	9,737
కె.గంగవరం	26	15,633	8,700
కాజులూరు	26	19,382	17,200
మండపేట	12	16,985	11,042
రాయవరం	12	14,646	12,002
కపిలేశ్వరపురం	19	16,333	7,200
మొత్తం	120	1,01,785	65,881


మొవ్వుకుళ్లు తెగులు ఆశించడంతో చచ్చిపోయిన వరి దుబ్బులను చూపిస్తున్న రైతులు


పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతు

యూరియా వాడకం తగ్గించాలి



యూరియాను రైతులు అధికంగా వాడేస్తున్నారు. ఎకరాకు 45 కిలోల వినియోగించాల్సి ఉండగా, అవగాహనా లోపంతో సుమారుగా 40 నుంచి 50 శాతం అధికంగా వాడుతున్నారు. దీని వలన పంటను పురుగులు, తెగుళ్లు ఆశిస్తున్నాయి. వ్యవసాయాధికారుల సూచనతోనే పురుగు మందులను వాడుకోవాలి. యూరియా వాడకాన్ని తగ్గించాలి.

– కేవీఎస్ రమేష్ కుమార్, మండల వ్యవసాయాధికారి, రాయవరం.

వైఎస్సార్ సీపీ వెంటే మా పయనం


మండపేటలో మాట్లాడుతున్న రాంబాబు, నాగేశ్వరరావు

- టీడీపీలో చేరతామన్న వార్త అవాస్తవం
- స్పష్టం చేసిన వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు

కపిలేశ్వరపురం (మండపేట): తాము వైఎస్సార్ సీపీ వెంటే నడుస్తామని, టీడీపీలో చేరుతున్నామంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని మండపేట రూరల్ మండలం వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యురాలు కురుపూడి భవాని, ఆమె భర్త, పార్టీ నాయకుడు రాంబాబు, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు స్పష్టం చేశారు. మండపేటలోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుపై జెడ్పీటీసీగా భవాని గెలుపొందారని, వైఎస్సార్ సీపీతోనే తమ కుటుంబం ముందుకు సాగుతుందన్నారు. పార్టీ మారుతున్నామంటూ రెండు రోజులుగా తమపై జరుగుతున్న ప్రచారం బాధించిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా కాలంలో అందించిన సంక్షేమం గతంలో ఏ నాయకుడూ అందించ లేదన్నారు. మండలంలో 22 మందికి 17 మంది ఎంపీటీసీ సభ్యులు వైఎస్సార్ సీపీ సభ్యులుగానే ఉన్నారన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ తోనే తామంతా ముందుకు సాగుతామన్నారు.

కూటమి ప్రలోభాలు

వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వ లబ్ధిని ప్రతి ఇంటికి తీసుకెళ్లి ఇచ్చిన రోజులను తాము జీవితంలో మర్చిపోలేమన్నారు. స్థానిక ఎన్నికల సమయంలో ప్రజలకు దూరమైన టీడీపీ, కూటమిగా అధికారంలోకి వచ్చాక.. వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలను ప్రలోభ పెట్టే ప్రయత్నాలను ముమ్మరంగా చేస్తోందన్నారు. మండల పరిషత్‌ను కైవసం చేసుకోవాలనే టీడీపీ కాంక్ష నెరవేరదన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా తామంతా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వెంట నడుస్తామన్నారు. ఆర్థిక ప్రయోజనాలను ఆశించి ఎంపీటీసీ సభ్యులు పార్టీ మారుతారన్న ఆశలను టీడీపీ నాయకులు వదులుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రైతులను గాలికొదిలేసిన కూటమి


మండపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, చిత్రంలో పట్టాభి రామయ్య తదితరులు

- రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ధ్వజం

కపిలేశ్వరపురం (మండపేట): రాష్ట్రంలో రైతులను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండపేటలోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. 2024 ఎన్నికల సమయంలో రైతుకు ఎకరానికి రూ.20 వేలు చొప్పున నగదు బదిలీ చేస్తానని కూటమి నేతలు చెప్పారని, కానీ పూర్తిస్థాయి ఆచరణలో విఫలమయ్యారన్నారు. పంటల బీమా ప్రీమియాన్ని రైతులే చెల్లించాలని చెప్పడం తగదన్నారు. రెడ్ బుక్ పేరుతో అప్రజాస్వామిక పాలన చేస్తూ, ఎన్నికల మేనిఫెస్టోను విస్మరించి, అన్యాయాలను ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సామాజిక కార్యకర్తలపై కేసులు పెడుతోందన్నారు. 50 ఏళ్లు పైబడిన బీసీ మహిళలకు నెలకు రూ.4 వేల చొప్పున పింఛను అందజేస్తానని మొండి చెయ్యి చూపించిందన్నారు. నిరుద్యోగ యువతకు రూ.3 వేల చొప్పున భృతి ఇస్తాన్న హామీని తుంగలోకి తొక్కిందన్నారు. సీఎం చంద్రబాబు ప్రజల ఆర్థిక ప్రయోజనాలను గాలికి వదిలేసి, రాజధాని అమరావతిపై గ్రాఫిక్స్ ప్రదర్శిస్తూ కల్లబొల్లి కబుర్లతో కాలం వెళ్లదీస్తున్నారన్నారు. ప్రతిపక్ష ప్రజాప్రతినిధులను ప్రలోభపెట్టి టీడీపీలోకి చేర్చుకోవడం చంద్రబాబు సహజ సిద్ధమైన రాజకీయ క్రీడ అని విమర్శించారు. పార్టీ సీనియర్ నాయకుడు వేగుళ్ల పట్టాభి రామయ్య చౌదరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అప్రజాస్వామిక పాలనను ప్రజా మద్దతుతో ఎదుర్కొనేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో మండపేట మండల అధ్యక్షుడు అడబాల బాబ్జి, జిల్లా ఉపాధ్యక్షులు దూలం వెంకన్న బాబు, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, నాయకులు కురుపూడి రాంబాబు, పెదపాటి సత్తిబాబు, చిర్ల జయరాం, పోతుల రాంబాబు, పలివెల సుధాకర్ పాల్గొన్నారు.

మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు


కోలంక వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై మోహన్ కుమార్, స్టేషన్ సిబ్బంది

కాజులూరు: మానవ తప్పిదాల వలనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని గొల్లపాలెం పోలీసు స్టేషన్ ఎస్సై ఎం.మోహన్ కుమార్ అన్నారు. సోమవారం కాకినాడ, కోటిపల్లి రహదారిపై ఆర్యావటం వద్ద ఎస్సై మోహన్‌కుమార్ స్టేషన్ సిబ్బంది నాకాబంది నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో ప్రయాణికులు మద్యం సేవించడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వెళ్లడం వల్లే వారికి ఎదుట వారికి ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అనధికారికంగా వాహనాల్లో మద్యం తరలించడం నేరమన్నారు.

కర్బలా అమర వీరులకు వీడ్కోలు


ద్రాక్షారామ ఆగావారి పంజాలో మజ్లిస్‌లు ఆలపిస్తున్న మత గురువు మౌలానా మీర్జా అలీ హుస్సేన్

రామచంద్రపురం రూరల్: కర్బలా మైదానంలో అశువులు బాసిన మహ్మద్ ప్రవక్త కుటుంబీకులను తలచుకుంటూ ద్రాక్షారామలో 68 రోజుల పాటు సంతాప దినాలుగా జరుపుకొంటున్న ముస్లింలు సోమవారం కర్బలా అమర వీరులకు వీడ్కోలు పలికారు. 11వ ప్రవక్త ఇమాం హసన్ అస్కరి చివరి రోజుల సంతాపాన్ని పురస్కరించుకుని బార్ మే ఇమాం పంజాలో మజ్లిస్‌ల అనంతరం మహిళలు, పురుషులు అగరత్తులు చేతపట్టుకుని అస్కరి గుమ్మటం నుంచి ఆగా వారి పంజాకు చేరుకుని అమరులకు వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొన్నారు. మత గురువు మౌలానా మీర్జా అలీ హుస్సేన్ మజ్లిస్‌ల రూపంలో కర్బలా అమరుల త్యాగాలను వివరించారు. ద్రాక్షారామలో ముస్లిం భక్తులు అమరులకు వీడ్కోలు పలుకుతూ ఇకపై శుభానికి సూచికగా తమ ఇళ్లపై ఎర్ర జెండాలను ఆవిష్కరించారు.

టీబీని తరిమి కొట్టడమే లక్ష్యం

మామిడికుదురు: 2027 నాటికి టీబీని దేశం నుంచి తరిమి కొట్టడమే ప్రభుత్వ లక్ష్యమని వైద్యాధికారి లలిత పేర్కొన్నారు. టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం సోమవారం పాశర్లపూడిలంకలో జరిగింది. టీబీ లక్షణాలు, దాని నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ప్రభుత్వం రూపొందించిన పోస్టర్లను సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, పంచాయతీ కార్యదర్శి సురేష్ ఆవిష్కరించారు. టీబీ అనుమానితులు విధిగా కళ్లి పరీక్ష చేయించుకోవాలన్నారు. టీబీని నిర్లక్ష్యం చేస్తే ఏడాదిలో మరో ఇద్దరు ఆరోగ్యవంతులకు ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. లక్షణాలు ఉన్న వారు వెంటనే ప్రభుత్వాస్పత్రి డాక్టరును సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమణ, సూపర్ వైజర్ చక్రధర్, హెల్త్ అసిస్టెంట్ కె.సూర్యనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిలకడగా గోదావరి


ఫెర్రిలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

కె.గంగవరం: వారం వ్యవధిలో రెండు సార్లు ఉగ్రరూపం దాల్చిన గోదావరి సోమవారం ఉదయం నుంచి నిలకడగా ఉంది. ఆదివారంతో పోలిస్తే సోమవారం సాయంత్రానికి కొంత మేర వరద ఉధృతి తగ్గిందని రెవెన్యూ సిబ్బంది చెబుతున్నారు. వరద ఉధృతి నిలకడగా ఉండడంతో గోదావరి పరివాహక ప్రజలు, ముంపు గ్రామ ప్రజలు కొంత వరకు ఉపసమనం పొందారు. కోటిపల్లి రేవులోని ఫెర్రి వద్ద పుష్కర ఘాట్ మెట్ల దిగువ వరకు ప్రస్తుతం వరదనీరు ప్రవహిస్తోంది. కోటిపల్లిలోని మత్స్యకార కాలనీలో గోదావరి గట్టున ఉన్న పాకల వద్ద అడుగు దూరంలో వరద నీరు ప్రవహిస్తోంది. శేరిలంక గ్రామం గోదావరి మధ్యలో ఉండడం వల్ల వరద ఉధృతి ఇంకా కొనసాగుతోంది.

కోటిపల్లి వద్ద సందర్శకుల తాకిడి

గోదావరి వరద రావడంతో కోటిపల్లిలోని వరద ఉధృతిని చూసేందుకు పలు గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో కోటిపల్లి చేరుకుంటున్నారు. రేవు వద్ద ఉన్న గట్టు వద్ద వందలాదిగా జనం చేరి గోదావరిని చూసి పూర్తిగా శాంతించాలని పూజలు చేస్తున్నారు. కొందరు సెల్ఫీలు తీసుకుంటున్నారు. జనం తాకిడితో పోలీసులు అలర్ట్ అయి బందోబస్తు నిర్వహిస్తున్నారు.

నేషనల్ కిక్ బాక్సింగ్‌లో ద్రాక్షారామ చిన్నారుల ప్రతిభ


నేషనల్ కిక్ బాక్సింగ్‌లో సత్తా చాటిన ద్రాక్షారామ కుర్రోళ్లు

రామచంద్రపురం రూరల్: గత నెల 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు తమిళనాడులో నిర్వహించిన నేషనల్ కిక్ బాక్సింగ్ పోటీల్లో ద్రాక్షారామ చిన్నారులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎ.సంతోష్ క్రియేటూ ఫామ్ విభాగంలో 4వ స్థానం, స్కైలార్క్ స్కూల్ విద్యార్థి కె.విష్ణువర్ధన్ పాయింట్ ఫైట్ విభాగంలో పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, చత్తీస్‌గఢ్, మేఘాలయా రాష్ట్రాల విద్యార్థులతో పోటీ పడి రెండో స్థానం సాధించినట్టు కోచ్ పెండ్ర బాలకృష్ణ సోమవారం విలేకరులకు తెలిపారు. వారిని గ్రామ సర్పంచ్ కొత్లపల్లి అరుణ, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ నున్న సత్యవతి, ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ అభినందించారు.

టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక


క్రీడాకారులకు సూచనలు ఇస్తున్న వ్యాయామోపాధ్యాయులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేటలోని వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. సుమారు 150 మంది క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించగా 24 మందిని జిల్లా పోటీలకు ఎంపిక చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి క్రీడాకారులు, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నెల 13, 14 తేదీల్లో మండపేటలో రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రేలంగి నాగకుమార్, బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ముంగర వెంకట రాజు, వ్యాయామోపాధ్యాయులు అనురాధ పాల్గొన్నారు.

విద్యార్థులను చైతన్యవంతులుగా చేయాలి


సత్య దుర్గాప్రసాద్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం (మండపేట): వైఎస్సార్ సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యకలాపాలను ముమ్మరం చేయడం ద్వారా విద్యార్థులను చైతన్యవంతులను చేయాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ఇటీవల రాష్ట్ర విద్యార్థి విభాగం కమిటీ సహాయ కార్యదర్శిగా నియమితులైన ద్వారపూడికి చెందిన పోతుల వీరవెంకట సత్యదుర్గా ప్రసాద్ సోమవారం ఆయనను మండపేటలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు వేగుళ్ళ పట్టాభి రామయ్య చౌదరి, మండపేట రూరల్ మండల అధ్యక్షుడు అడబాల బాబ్జీ, జిల్లా ఉపాధ్యక్షుడు దూలం వెంకన్నబాబు, నాయకులు కుడుపూడి రాంబాబు, పోతుల రాంబాబు పాల్గొన్నారు.

నేడు సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకం ప్రదర్శన

కొత్తపేట: దక్షిణ భారతదేశంలో ప్రముఖ పౌరాణిక రంగస్థల కళాకారులుగా రాణిస్తున్న నటీ నటులతో మంగళవారం కొత్తపేట మండలం వాడపాలెంలో సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటక ప్రదర్శన నిర్వహించనున్నారు. వాడపాలెం పాత మార్కెట్ గణపతి నవరాత్ర ఉత్సవ పందిరిలో ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ ప్రెసిడెంట్ గనిశెట్టి చంద్రశేఖర్, సభ్యులు బండారు భాస్కరరావు, కురచ వెంకటేశ్వరరావు తెలిపారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ రామచంద్రపురం సీనియర్ సివిల్ [illegible] కోర్టులో

E.P.No.40/2020 in O.S.No.444/2010

Between:

[illegible] ...DHR

[illegible]

1. [illegible]
2. [illegible] ...JDR's

[illegible] E.P. [illegible] JDR's [illegible] 17-09-2025 [illegible] 10.00 [illegible] Amina [illegible] DHR [illegible]

[illegible]

DHR [illegible] రూ.2,00,000/- [illegible] రూ.3,50,000/-

[illegible] తేది: 17-09-2025

[illegible]

[illegible] తేది: 31-08-2025 T.S.S.S.N. [illegible] కుమార్, DHR అడ్వకేట్, [illegible] సెల్: 99089 87728